
నమస్తే తెలంగాణ
# మెదక్
I హైదరాబాద్, ఆదివారం 22 జూన్ 2025 MEDAK





కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విద్యుత్ కోతలు మొదలయ్యాయి. పటాన్‌చెరు ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్న రైతులు సాగు కోసం అప్పు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. రైతుల పంట రుణమాఫీ చేస్తామని ప్రకటించినా ఇంతవరకు అమలు చేయలేదు. రైతులకు బ్యాంకులు పంట రుణాలు ఇవ్వకపోవడంతో వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తీసుకునే పరిస్థితి వచ్చింది. వికారాబాద్, గద్వాల్ జిల్లాల్లో రైతులు పంట భూములు తీసుకోరాదని పోరాటం చేస్తే బేడీలు వేసి జైలులో పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. రాష్ట్రంలో రైతు రాజ్యం కాదు బేడీల రాజ్యం నడుస్తున్నది.

– జిన్నారం మహాధర్నాలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



సంగారెడ్డి జిల్లా జిన్నారంలో రైతు మహాధర్నాకు వస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు




సంగారెడ్డి జిల్లా జిన్నారంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మహాధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, వేదికపై ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ముఖ్య నాయకులు

# రైతుభరోసా ఇవ్వకుంటే ఓఆర్ఆర్‌ను దిగ్బంధిస్తాం

**పటాన్‌చెరు నియోజకవర్గంలో 22 వేల మంది రైతులకు రైతు భరోసా సాయం ఇచ్చే వరకు పోరాటం**

- స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతు భరోసా అమలు
- ప్రతి రైతుకు ప్రభుత్వం రూ. 12 వేలు బాకీ ఉంది
- ముందు బాకీ ఉన్న రూ. 12 వేలు చెల్లించాలి
- వ్యవసాయానికి నాణ్యమైన కరెంట్ సరఫరా లేదు
- బీఆర్ఎస్ హయాంలో 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా
- జీపీలో డబ్బులు లేక ట్రాక్టర్లలో డీజిల్ పోయడం లేదు
- పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు లేవు
- సీఎం రేవంత్‌రెడ్డి జహీరాబాద్‌కు వచ్చినా ఒక్క పైసా ఇవ్వలేదు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- సంగారెడ్డి జిల్లా జిన్నారంలో రైతు మహాధర్నా సక్సెస్
- పెద్దఎత్తున హాజరైన రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



సంగారెడ్డి జిల్లా జిన్నారంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

పటాన్‌చెరు, జూన్ 21: రైతు భరోసా డబ్బులు ఇవ్వకుంటే ఓఆర్ఆర్‌ను దిగ్బంధం చేస్తామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం సంగారెడ్డి జిల్లా జిన్నారంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన రైతు మహాధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో 22వేల మంది రైతులకు రైతు భరోసా డబ్బులు ఇవ్వడం లేదన్నారు. 22 వేల మంది రైతు కుటుంబాలతో ఓఆర్ఆర్‌పై వంటావార్పు చేసి దిగ్బంధం చేస్తామని ప్రకటించారు. రైతులకు రైతు భరోసా డబ్బులు ఇచ్చే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. రైతుల ఆత్మహత్యలు పెరగకుండా భరోసా కల్పించారన్నారు. వానకాలం సాగు మొదలైనా ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ రైతులకు ఎకరానికి రూ. 10 వేలు రైతు భరోసా డబ్బులు ఇచ్చారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎకరానికి రూ. 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పింఛన్ నెలకు రూ.2వేలు ఇస్తే కాంగ్రెస్ రూ. 4వేలు ఇస్తామని హామీ ఇచ్చినా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విద్యుత్ కోతలు మొదలయ్యాయని, వేముల రేవంత్‌రెడ్డి కాదు కోతల రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. పటాన్‌చెరు ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్న రైతులు పంటల సాగు కోసం అప్పు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అందరికీ ఇస్తామని ప్రకటించిందన్నారు . రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ ఎంతో చేశారని గుర్తుచేశారు. యాసంగిలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా డబ్బులు ఇవ్వలేదని, మండలంలో ఒక్క గ్రామంలో మాత్రమే రైతులకు డబ్బులు వేశారన్నారు. ఒక్కో రైతుకు ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు రూ. 12 వేలు బాకీ ఉందని, ముందుగా రైతులకు బాకీ ఉన్న రూ.12 వేలు వేయాలని డిమాండ్ చేశారు. దేవుడి మీద ఒట్టు వేసి హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. రైతుల పంట రుణమాఫీ చేస్తామని ప్రకటించినా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. రైతులకు బ్యాంకులు పంట రుణాలు ఇవ్వకపోవడంతో వడ్డీవ్యాపారుల నుంచి అప్పులు తీసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. రైతులు తీసుకున్న పంట రుణాలు చెల్లించి, తిరిగి కొత్త రుణాలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడంతో ఎంతోమంది రైతులు బ్యాంకుల్లో ఉన్న అప్పులు చెల్లించారన్నారు. అప్పులు చెల్లించిన రైతులకు కూడా బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదన్నారు. రైతులకు భరోసా కల్పించేందుకు కేసీఆర్ రైతు బీమా పథకం అమలు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. రైతు మృతిచెందితే కేసీఆర్ ప్రభుత్వం ఆ రైతు కుటుంబానికి రూ.5 లక్షల బీమా డబ్బులు చెల్లించిందన్నారు. అసెంబ్లీ సమావేశంలో పంటల బీమా పథకం అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించి మాట తప్పాడని విమర్శించారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలను బంద్ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వికారాబాద్, గద్వాల్ జిల్లాల్లో రైతులు పంట భూములు తీసుకోరాదని పోరాటం చేస్తే బేడీలు వేసి జైలులో పెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో రైతు రాజ్యం కాదు బేడీల రాజ్యం నడుస్తున్నదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూములు కొనుగోలు చేసేందుకు రియల్ వ్యాపారులు వచ్చేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అవసరం కోసం భూములు అమ్మకం చేస్తామని చెప్పినా ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జహీరాబాద్‌కు వచ్చినప్పుడు ఎమ్మెల్యే మాణిక్‌రావు నియోజకవర్గ అభివృద్ధి కోసం గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేయాలని కోరినా ఒక్క పైసా ఇవ్వలేదని ఆరోపించారు. కేసీఆర్ గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు పంపిణీ చేస్తే డీజిల్‌కు పైసలు లేక పనులు చేయడం లేదన్నారు. భవిష్యత్‌లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదన్నారు. సమావేశంలో సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్, జహీరాబాద్, దుబ్బాక, నర్సాపూర్ ఎమ్మెల్యేలు కొనింటి మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ్‌రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశం గౌడ్, బాల్‌రెడ్డి, మాణిక్యం, తొంట అంజయ్య, సోమిరెడ్డి, చంద్రగౌడ్, ఐలాపూర్ మాణిక్ యాదవ్ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న రప్ప రప్ప ప్లకార్డు

జిన్నారం, జూన్ 21: సంగారెడ్డి జిల్లా జిన్నారంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం నిర్వహించిన నియోజకవర్గ రైతు మహాధర్నాలో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రదర్శించిన ప్లకార్డు అందరి దృష్టిని ఆకర్షించింది. ఇటీవల హీరో అల్లు అర్జున్ ఓ సభా వేదికపై పుష్ప 2 సినిమాలోని రప్ప రప్ప డైలాగ్ చెప్పడం, ఏపీలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన రప్ప రప్ప డైలాగ్‌లు మహాధర్నాలో మార్మోగాయి. మాజీ మంత్రి హరీశ్‌రావు ఫొటోతో ఉన్న 2028లో రప్ప రప్ప 3.0 లోడింగ్ పేరుతో గులాబీ ప్లకార్డులు స్థానికంగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ముఖ్య నాయకులు, కార్యకర్తలు మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.




## వాగ్దానాలు నెరవేర్చని సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం ఎన్నో ఉచిత వాగ్దానాలు చేసి ఏతుల రేవంత్‌రెడ్డిగా మిగిలిపోయాడు. ప్రభుత్వం ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదు. బీఆర్ఎస్ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ నాట్లు పడక ముందే రైతుల ఖాతాల్లో రైతు బంధు డబ్బులు జమ చేశారు. కానీ నేడు పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఓట్లు వస్తేనే రైతు భరోసా వేస్తున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని రైతులకు రైతు భరోసా ఇవ్వకపోవడం శోచనీయం. ఈ ధర్నా చూసైనా ముఖ్యమంత్రి రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమచేయాలి. – చింతా ప్రభాకర్, సంగారెడ్డి ఎమ్మెల్యే

## కాంగ్రెస్ ప్రభుత్వం దిగిరావాలి



ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఓట్లు వేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చిన తర్వాత అసలు విషయం తెలుసుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ నాట్లు పడకముందే రైతులకు డబ్బులు వేశారు. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు. రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగినా పంట రుణమాఫీ కాలేదు. వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు పుట్టడం లేదు. రైతులను ప్రభుత్వం ఆదుకోకుండా విస్మరించింది. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ సరిహద్దుల్లోని రైతులను వ్యాపారస్తులుగా భావిస్తున్నారు. ఇక్కడి వారు కూడా రైతులేనని అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి. వ్యవసాయ మండలాలను సైతం కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టింది. రైతు భరోసా నిధులు ఎగ్గొట్టకుండా ధర్నా చూసైనా ప్రభుత్వం దిగివచ్చి నిధులు విడుదల చేయాలి.
– సునీతాలక్ష్మారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే

## ప్రభుత్వాన్ని నిలదీస్తేనే పనులు జరుగుతాయి



పటాన్‌చెరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతుల పట్ల ప్రభుత్వం తీరు సరైంది కాదు. కొంతమందికే కాకుండా అందరికీ రైతు భరోసా నిధులు జమచేయాలి. కాంగ్రెస్ నాయకులకు బిస్కెట్లు వేస్తే సీఎం రేవంత్‌రెడ్డి తోక చుట్టూ తిరుగుతున్నారు. ఇటీవల దుబ్బాక నియోజకవర్గంలో ఓ మంత్రి పర్యటించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి కార్యక్రమం ఉన్నా నాకు సమాచారం లేదు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తే ప్రభుత్వం దిగివచ్చి 1500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించింది. చేతులు ముడుచుకుని కూర్చుంటే పనులు జరగవు. ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడే నిలదీయాలి అప్పుడే పనులు జరుగుతాయి. – కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే

## తెలంగాణకు బీఆర్ఎస్ శ్రీరామరక్ష



రింగ్ రోడ్డు చుట్టూ ఉన్న 147 గ్రామాలు, నాలుగు మండలాల రైతులు సీఎం రేవంత్‌రెడ్డికి ఓట్లు వేయలేదా. వారేం పాపం చేశారని రైతు భరోసా నిధులు వేయలేదు. కాంగ్రెస్ నాయకులు ఇంటి ముందుకు వస్తే నిలదీయండి. ప్రభుత్వం ఏ పని చేసినా మోసపూరితంగానే ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఈ విషయం తెలుసుకోవాలి. 420 హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులు, మహిళలు, యువకులను దారుణంగా మోసం చేసింది. రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచిన పార్టీ బీఆర్ఎస్ మాత్రమే. తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీ శ్రీరామరక్ష. రైతు భరోసా నిధులు విడుదల చేసేలా స్థానిక కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడే నిలదీయాలి.
–ఆదర్శ్‌రెడ్డి, బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గం కోఆర్డినేటర్

## సంగారెడ్డి కలెక్టర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 21: సంగారెడ్డి నూతన కలెక్టర్ ప్రావీణ్యను శనివారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి కలిసి జిల్లాకు సంబంధించిన విషయాలు చర్చించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ప్రావీణ్యను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

## జయశంకర్ స్ఫూర్తితోనే తెలంగాణ సాధన

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

మర్కూక్, జూన్ 21: ఆచార్య జయశంకర్ స్ఫూర్తితోనే కేసీఆర్ తెంగాణ ఉద్యమం నడిపించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని కొండపోచమ్మ ప్రాజెక్టు వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని అన్ని పార్టీలను ఏకం చేసి తెలంగాణ సాధించిన గొప్పనాయకుడు కేసీఆర్ అన్నారు. ఉమ్మడి ఏపీ పాలనలో తెలంగాణ ఎడారిని తలపించేదన్నారు. కేసీఆర్ పాలనలో కాళేశ్వరం, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ నిర్మించారన్నారు. ప్రజల సాగు, తాగునీటి ఇబ్బందులు తొలిగించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి ఆరేండ్లు అవుతున్న సందర్భంగా కొండపోచమ్మ ప్రాజెక్టులో గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎటు చూసినా పచ్చని పొలాలు కనిపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో మండుటెండల్లో కేసీఆర్ రైతులకు సాగునీరు అందించారని గుర్తుచేశారు. రాష్ట్రానికి అన్నం పెడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టుపై నిందలు మోపడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, రామచంద్రం, పాండుగౌడ్, మ్యాకల కనకయ్య, బట్టు సుధాకర్‌రెడ్డి, సాయిని మహేశ్, కిరణ్‌గౌడ్, నూనె కుమార్, రాజమౌళి, అర్జున్‌గౌడ్, ఇంద్రసేనారెడ్డి, అచ్చంగారి భాస్కర్, మద్ది రాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని కొండపోచమ్మ ప్రాజెక్టు వద్ద జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

## రైతు మహాధర్నాలో షాడో పోలీసులు

- బీఆర్ఎస్ ముఖ్యనేతలు, రైతుల వీడియోలు తీసిన సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసులు
- రైతు మహాధర్నాకు ఏ గ్రామం నుంచి ఎంతమంది వచ్చారో వివరాల సేకరణ

పటాన్‌చెరు, జూన్ 21: ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు చెల్లించాలని సంగారెడ్డి జిల్లా జిన్నారంలో శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మహాధర్నాలో షాడో పోలీసులు అడుగడుగునా వీడియోలు తీశారు. ప్రభుత్వం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్, జిన్నారం రైతులకు రైతు భరోసా డబ్బులు నిలిపి వేసింది. దీంతో రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిన్నారంలో మహాధర్నా నిర్వహించారు. ఈ మహాధర్నాకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుతో పాటు సంగారెడ్డి, దుబ్బాక, నర్సాపూర్, జహీరాబాద్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ యాదవ్‌రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఇంటెలిజెన్స్, ఎస్బీ పోలీసులు సివిల్ డ్రెస్‌లో ఉండి మహాధర్నాకు వచ్చిన వారి వీడియోలు తీసుకున్నారు. వేదికపై ముఖ్యనేతలు మాట్లాడుతుండగా సివిల్‌డ్రెస్‌లో ఉన్న పోలీసులు వీడియో రికార్డు చేశారు. మహాధర్నా వద్ద సివిల్ డ్రెస్‌లో పోలీసులు ఉండడంతో పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. పోలీసులు ఏ గ్రామాల నుంచి రైతులు వచ్చారో వివరాలు సేకరించారు. మహా ధర్నాకు ర్యాలీగా వస్తున్న వారి వీడియోలు రికార్డు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు రావడం లేదని, రైతులు రాకుండా ఉండేందుకు కొందరు తప్పుడు ప్రచారం చేయడం కనిపించింది. మహాధర్నా సమయానికి ముందుగా బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి వచ్చారు.



మహాధర్నాలో వీడియో తీస్తున్న సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసులు